# సిఎంచే అభివృద్ధి పనులు ప్రారంభం.. శంకుస్థాపనలు



కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సోమవారం కుప్పంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి పలువాటికి శంకుస్థాపనలు చేశారు. 289కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు.పిఎం కుసుమ్ పథకంలో చేపట్టిన 15 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును సిఎం ప్రారంభించారు. అలాగే కుప్పంలో 10కోట్లతో నిర్మించే ఆర్డీఒ, డిఎస్పీ కార్యాలయాలు, మల్లానూరులో 2.7కోట్లతో నిర్మించే జూనియర్ కాలేజ్ భవనాలు, 3.3కోట్లతో నిర్మించే సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ సెంటర్‌తో పాటు డిగ్రీ మహిళా హాస్టల్ భవన నిర్మాణాలకు,10కోట్లతో 35 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు, కుప్పం మున్సిపాలిటీలో 38కోట్ల విలువైన పనులను ముఖ్యమంత్రి శ ంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికె ఎం ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్,టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి పాల్గొన్నారు.

## క్రీడాప్రతిభకు వైసిపి అవమానం

### - ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:

సంవత్సరాల పాటు శ్రమించి క్రీడల్లో అత్యున్నత ప్రతిభ కనబరచి, డిఎస్సీలో ఉద్యోగం సంపాదించిన క్రీడాకారులను వైసిపి నాయకులు అవమానిస్తున్నారనీ ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం శాప్ కార్యాలయం వద్ద అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసేందుకు వచ్చిన స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై వైసిపి నాయకులు దాడి చేయడం అత్యంత నీచమైన చర్య అని ఖండించారు. నిబంధనల ప్రకారమే క్రీడల్లో రాణించిన వారికి 3శాతం ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ఎలాంటి అక్రమాలకు తావు లేదని, వైసిపి నాయకులు రాజకీయ స్వలాభం కోసం అనవసర రాద్ధాంతం చేస్తున్నారనీ, స్పోర్ట్స్ కోటాలో డిఎస్సీలో ఉద్యోగాలు వచ్చిన వారిని ఫేక్ సర్టిఫికేట్స్ అనడం క్రీడాలోకాన్ని నివ్వెర పరుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, పనుల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

## గురజాడ అప్పారావు జయంతి వేడుకలు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణం, పివికెయన్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను తెలుగువిభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. జీవన్‌జ్యోతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. సమాజంలోని మూఢనమ్మకాలు, దురాచాలపై తన సాహిత్యంలో పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. వైస్‌ప్రిన్సిపాల్ డా. జయచంద్రుడు, తెలుగు విభాగాధిపతి డా.చెన్నకేశవులు ప్రజల్లో దేశభక్తిని, మానవతా విలువలను పెంపొందించిన యుగకర్త గురజాడ అని పేర్కొన్నారు. వీరితో పాటు ఐక్యూఎసి కోఆర్డినేటర్ శశికళ గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం నాటి సమాజంలోని లోపాలను ఎండగడుతూ సామాజిక చైతన్యానికి ఎంతగానో తోడ్పడిందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోపిర్యా నాయక్, ఉమాదేవి, రేఖ, చంద్రలతో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ సెల్ అర్జీలపై తక్షణ స్పందన

పూతలపట్టు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త



మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు వివిధ సమస్యలతో అర్జీదారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన అర్జీలను తహసీల్దార్ పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను అక్కడికక్కడే తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో తహసీల్దార్ ఫోన్ ద్వారా సంబంధిత వీఆర్వోలు, సర్వేయర్లతో మాట్లాడి సమస్యలపై చర్చించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రీవెన్స్ సెల్ ద్వారా అందించే అర్జీలపై అధికారులు బాధ్యతగా స్పందించాలని తహసీల్దార్ సూచించారు. ప్రతి అర్జీని నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.గ్రీవెన్స్ సెల్‌లో తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించడంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## సిఎం సమక్షంలో ఐదు సంస్థల ఎంఒయులు




కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సోమవారం ఆయా సంస్థల ప్రతినిధులు సిఎం చంద్రబాబునాయుడు సమక్షంలో మౌఖిక ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నారు. 350 కోట్ల పెట్టుబడులతో న్యూట్రాజెనిక్ ప్రై.లి.సంస్థ,150 కోట్లతో ఎంగామ్ డెయిరీ ఫుడ్స్, 70కోట్లతో కింబర్లైట్ కెమికల్స్, 67 కోట్లతో పయనీర్ ఎక్స్‌ట్రాక్స్ సంస్థ కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)తో ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం మనరోవర్‌యాప్‌ను సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించారు.

## మసీదులో అజాన్.. ప్రసంగం ఆపేసిన సిఎం

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

కుప్పం కొత్తపేటలో సోమవారం జరిగిన బహిరంగ సభలో సిఎం చంద్రబాబునాయుడు ప్రస ంగిస్తున్న సమయంలో మధ్యాహ్నం 1గ ంట కాగానే కొత్తపేటలోని మసీదులో అజాన్ ఇచ్చారు. ఈ సమయంలో సిఎం చంద్రబాబు తన ప్రసంగాన్ని అజాన్ పూర్తయ్యే దాకా సుమారు ఐదు నిమిషాల పాటు ఆపేశారు. సభలో జనం సైతం నిశ్శబ్దం అయ్యారు. అనంతరం సిఎం చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించి సంప్రదాయాలను గౌరవించాలని పేర్కొన్నారు.

## ఘనంగా అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పెనగలూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి, డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులు రెడ్డి లు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణ లతో లేబాక శ్రీనివాసులు రెడ్డి, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ లేబాక రాజమ్మ లు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ నిధులు రూ. 40 లక్షలతో ఈ ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్ రెడ్డి, లేబాక రెడ్డయ్య రెడ్డి, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, ఆనంద నాయుడు, కోడూరు వెంకటయ్య, చక్రంపేట సురేష్ రెడ్డి, మనోజ్ రెడ్డి, కళాచంద్ర, పుచ్చకాయల లక్షి ్మ నరసయ్య, ఓబిలి అమిరుల్లా, కరీముల్లా, శివ పాల్గొన్నారు.

## రైతు బజార్ కు శంకుస్థాపన చేసిన సీఎం




కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

కుప్పం పట్టణం ఫ్లైఓవర్ సర్కిల్ వద్ద రెండు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించే రైతు బజార్ నిర్మాణానికి సంబంధించి సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ రైతు బజార్లో రైతుల సౌకర్యార్థం 58 స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు రైతులు తమ పంటలను తామే విక్రయించుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జిఎం రాజు, మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## చిత్తూరు - కుప్పం మధ్య బ్రాడ్‌గేజ్ కోరాం

### - సిఎం చంద్రబాబునాయుడు

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

చిత్తూరు - కుప్పం పట్టణం మధ్య రైల్వే బ్రాడ్ గేజ్ నిర్మించాలని కేంద్ర రైల్వేమంత్రిని కోరినట్లు సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ రైల్వే లైను ఏర్పాటయితే కుప్పం నుంచి నేరుగా దుగ్గరాజపట్న ం, కృష్ణపట్నం పోర్టులకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటు పలమనేరు - కృష్ణగిరి మధ్య ఫోర్‌లైన్ , కెజిఎఫ్ - కుప్పం మధ్య నేషనల్ హైవే, పోగురుపల్లి నుంచి బెంగళూరుకు హైవే నిర్మాణంకు ప్రతిపాదనలు పంపామన్నారు. కుప్పంలో త్వరలోనే ఎయిర్‌పోర్టు కూడా రానుందని సిఎం బహిరంగసభలో పేర్కొన్నారు.

## కాణిపాకంలో నేడు (మంగళవారం)

మధ్యాహ్నం : అభిషేకం, బిక్షాండి.
ఉభయదారులు: దేవస్థానం వారిచే.
రాత్రి : తిరుకళ్యాణం
ఉభయదారులు : కాణిపాకం, తిరువణంపల్లె, వణిగ వంశస్థులు
రాత్రి : అశ్వవాహనసేవ
ఉభయదారులు: 44 బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజ వంశస్థులు.

ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ఉదయం 10 గంటల నుండి మధ్యాహ ్నం 2 గంటల వరకు భక్తిరంజని, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు సుమతి భాగవతారిణిచే హరికథ, రాత్రి 8 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు పౌరాణిక నాటకప్రదర్శనలు

## గణనాధునికి సాంస్కృతిక నీరాజనం

### -హోరెత్తించిన సాంస్కృతిక కార్యక్రమాలు




కాణిపాకం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన రథోత్సవం సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. రథోత్సవం సందర్భంగా ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల కాలక్షేపం నిమిత్తం స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు భక్తిరంజని, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం, ఉభయదారులచే ఏర్పాటు చేశారు. అలాగే రథోత్సవం ఊరేగింపు సందర్భంగా గ్రామ పురవీధులలో రాష్ట్రంలోనే పేరొందిన ప్రఖ్యాత కళాకారులచే వైవిధ్యభరితమైన సా ంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథోత్సవం ముందు పదాతి దళాలు,విచిత్ర వేషదారణలు, రాజరిక వేషదారణ, డప్పు వాయిద్యం, కోలాటాలు, చెక్కభజనలు, పిల్లన గ్రోవి, డ్రమ్స్ వంటి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకోగా, ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది.

## డాక్టరేట్ పొందిన వారికి ఆత్మీయ అభినందన సభ..

రైల్వేకోడూరు రూరల్ సెప్టెంబర్ 21(ప్రభాతవార్త)::



రైల్వేకోడూరు మండలానికి చెందిన రిటైర్డ్ ఏపిఎండిసి మాజీ ఉద్యోగి డాక్టర్ మోడీ సుబ్బరాయుడు, డాక్టర్ మండెం సుబ్రమణ్యం శర్మ లు ఇటీవల న్యూఢిల్లీ నందు గౌరవ డాక్టరేట్ పొందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు మండలానికి చెందిన సామాజిక కార్యకర్త మందపాటి శంకరయ్య ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందిన వీరు ఇరువురిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రైల్వే కోడూరు ప్రాంతంలో పుట్టి న్యూఢిల్లీ స్థాయిలో గౌరవ డాక్టరేట్ను పొందడం సామాన్యమైన విషయం కాదని వారు అన్నారు. అదేవిధంగా మన ప్రాంతానికి చెందిన వీరిని సన్మానించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాను ఆర్కెస్ట్రా అధినేత తిరుపాలు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు శేఖర్, పెంచలయ్య, దాసరి చంద్ర, డీలర్ దళిత నాయకులు సుబ్బ నరసయ్యలు పాల్గొని మండెం సుబ్రహ్మణ్యం, మోడీ సుబ్బరాయుడు దంపతులను సన్మానించారు.

## విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలి

పెనగలూరు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బడికి వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మూర్తి, విద్యార్థులు టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి కి వినతి పత్రాన్ని ఇచ్చారు. పోలి, హత్యారాల, మందరం ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తారని కానీ ప్రభుత్వ ఆర్టీసీ బస్సు లు ఆపడం లేదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. బస్సులు ఆపక పోవడం వలన పాఠశాలకు లేటు వస్తున్నామని విద్యార్థులు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు ఇచ్చిన వినతి పత్రాన్ని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## సిఎం చంద్రబాబుకు ఘనస్వాగతం



శాంతిపురం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

రెండు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. సోమవారం ఉదయం సుమారు 10.15గంటలకు సిఎం చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో తుమ్మిశి వద్దగల హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు అమరనాథ్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, జిల్లా టిడిపి అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, చుడా చైర్మన్ అనురాధ, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ సిఎంపిఎ మనోహర్, నేతలు ఉదయ్‌కుమార్, వెంకటాద్రినాయుడు, ఉమాపతి,విశ్వనాథనాయుడు, మణి, చంద్ర, గిరిధర్, బాలు తదితరులు సి ఎంకు ఘనస్వాగతం పలికారు.

## సిఎంకు స్వాగతం పలికిన ఎంపి,ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:



రెండు రోజుల పర్యటన నిమిత్తం చిత్తూరు జిల్లా కుప్పంకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. సోమవారం ఉదయం తుమ్మిసి హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రిని దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్‌లు మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్దిపనులు, జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

## టౌన్‌బ్యాంక్ పాలకవర్గంకు ప్రతిపాదనలు

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

కుప్పం పట్టణ సహకార బ్యాంక్ (టౌన్‌బ్యాంక్)కు పాలకవర్గంను ఏర్పాటుచేసే ందుకు సహకార శాఖకు ప్రతిపాదనలు వెళ్లినట్లు తెలిసింది. చైర్మన్‌గా మంజునాథ్, వైస్ చైర్మన్‌గా ఉదయ్ వడయార్, డైరెక్టర్లుగా చాంద్, నవనీత, సింధులను ప్రతిపాదించారని సమాచారం. త్వరలోనే నూతన పాలకవర్గ నియామకం ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయి.

## ఘనంగా సోమవారోత్సవాలు

రామకుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



స్థానిక శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో సోమవారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నాగుల ముద్దమ్మ, నక్షత్ర వనం, శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీ శనీశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మొక్కులు కలిగిన భక్తులు వివిధ రకాల కావడులు, ఒంటినిండా నిమ్మకాయలతో వచ్చి మొక్కులు చెల్లించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం జరిపారు. స్వామివారి ఉత్సవాన్ని ఊరేగించారు.

## తెదేపాలో చేరిన వైకాపా నేత



రామకుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

మండలంలోని గొల్లపల్లి గ్రామంకు చెందిన వైకాపా నేత శంకర్ సోమవారం గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, దేశం నేతల సమక్షంలో తెదేపాలో చేరారు. కార్యక్రమం లో మాజీ సర ్పంచులు రామూర్తి, రఫీ, నేతలు నరసింహులు, వెంకటరామేగౌడు, రామలింగారెడ్డి, సత్తి, బాబు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన స్థంభం

బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



మండలంలోని కుప్పనపల్లి గ్రామంలో వర్షం, ఈదురుగాలి ధాటికి విద్యుత్ స్థంభం విరిగి ట్రాన్స్ ఫార్మర్‌పై పడింది. ఈసంఘటన రైతు చంద్రాచారి పొలంలో జరిగింది. ఈ విషయంగా అధికారులకు పలుమార్లు తెలిపినా అధికారులు పట్టించుకోవడంలేదని రైతు కుటుంబీకులు వాపోయారు. వెంటనే తమకు విద్యుత్ స్థంభాన్ని మార్చి విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

## డిప్యూటీ ఈఈ గా పెద్దయ్య బాధ్యతలు

చిట్వేలి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



చిట్వేలి ప్రధాన కేంద్రంగా చిట్వేలి,పుల్లంపేట, పెనగలూరు మండలాలకు విద్యుత్ సేవలు అందించేందుకు చిట్వేలిలో ఏర్పాటుచేసిన సబ్ డివిజన్ కార్యాలయానికి పూర్తిస్థాయి అధికారిగా పెద్దయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు.నంద్యాల హెచ్ టి మీటర్స్ నందు విధులు నిర్వహిస్తున్న తాను బదిలీ నిమిత్తం ఇక్కడికి చేరారు. ప్రస్తుతం తాత్కాలిక అదనపు విధులు నిర్వహిస్తున్న బాలాజీ అధికారి పెద్దయ్యను,సిబ్బందితో కలిసి సత్కరించి బాధ్యతలను అప్పగించారు. అధికారి పెద్దయ్య మాట్లాడుతూ ప్రజల విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నా వంతుగా కృషి చేస్తానని తెలిపారు. గతంలో అధికారి బాలాజీ నిర్వహించిన విద్యుత్ విధులపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పై మూడు మండలాల విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నిర్మాణ పనులకు నిపుణుల పర్యవేక్షణ ఏదీ ?

### టెండర్లపై విచారణకు ఐక్య విద్యార్థి జేఏసీ డిమాండ్



తిరుపతి విద్య సెప్టెంబర్ 21 ప్రభాత వార్త

విశ్వవిద్యాలయ నిర్మాణ పనుల్లో సాంకేతిక పర్యవేక్షణ, నిధుల వినియోగంలో జవాబుదారీతనం ఉండాలని ఐక్య విద్యార్థి జేఏసీ డిమాండ్ చేసింది. ఎస్వీయూ ఇన్‌చార్జి ఇంజనీర్ తాండవ కృష్ణ పర్యవేక్షణలో జరిగిన టెండర్లు, ఏకైక టెండర్లు, నామినేషన్ పనులు, పనుల కేటాయింపులపై పలు అభ్యంతరాలు తమ దృష్టికి వచ్చాయని వైఎస్సార్‌ఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఎన్‌డీఎస్ఎఫ్ నేతలు తెలిపారు. అభ్యంతరాలపై స్వతంత్ర విచారణ చేపట్టడంతోపాటు పూర్తయిన నిర్మాణ పనులపై నాణ్యతా పరిశీలన నిర్వహించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి అర్హత కలిగిన ప్రభుత్వ శాశ్వత ఇంజనీర్‌ను నియమించి, టెండర్ల నుంచి నిర్మాణ పనుల పూర్తివరకు పారదర్శక పర్యవేక్షణ ఉండేలా చూడాలని కోరారు. నిధుల వినియోగం, పనుల కేటాయింపు, నిర్మాణ నాణ్యతాపై స్పష్టమైన జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీయూ వైఎస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, ఎన్‌డీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కోలార్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్ ఎత్తు తగ్గించాలంటూ వాహనదారుల ఆవేదన



పాకాల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త

పాకాల మండలం పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై నేడగంట-పెనుమూరు క్రాస్ వద్ద ఓవర్‌బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. స్పీడ్ బ్రేకర్ ఎత్తు ఎక్కువగా ఉండటంతో ముఖ్యంగా లోలెవల్ కార్లు, చిన్న కార్లు దాటే సమయంలో వాహనాల ముందు భాగం, ఇంజిన్ కింది భాగాలు బలంగా తగులుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు స్పీడ్ బ్రేకర్ వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొద్దిగా ఏమరుపాటుగా వాహనం నడిపినా స్పీడ్ బ్రేకర్‌ను బలంగా తాకడంతో వాహనాల కింది భాగాలు దెబ్బతిని, భారీగా మరమ్మతు ఖర్చులు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో స్పీడ్ బ్రేకర్ స్పష్టంగా కనిపించకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. అధికారులు నిబంధనలకు అనుగుణంగా స్పీడ్ బ్రేకర్ ఎత్తును పరిశీలించి, అవసరమైతే తగ్గించి, శాస్త్రీయ ప్రమాణాలతో తిరిగి ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే స్పీడ్ బ్రేకర్‌కు ముందుగా స్పష్టమైన హెచ్చరిక సూచికలు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## డప్పు కళాకారుల పెన్షన్ అర్జీల వెరిఫికేషన్

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండలంలోని పాండూరు పంచాయతీ పరిధిలోని పాండూరు, తొండంబట్టు గ్రామాలకు చెందిన డప్పు కళాకారులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయా అర్జీల వెరిఫికేషన్ కోసం కళాకారుల గ్రామాలలోకి వెళ్లి పరిశీలించిన వెల్ఫేర్ అసిస్టెంట్ కే. శామ్యూల్ కళాకారుల నుంచి వివరాలు సేకరించారు. డప్పు పెన్షన్ అర్హతకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా డప్పు కొట్టడాన్ని నిశితంగా పరిశీలన చేపట్టారు. అర్హులైన డప్పు కళాకారులకు పెన్షన్ అందేలా అర్జీలను నిబంధనల మేరకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రతాప రెడ్డి, మాధవ్, రాధ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం

చిన్నగొట్టిగల్లు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



ప్రభాతవార్త :చిన్నగొట్టిగల్లు మండలఎంపీపీ యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక , జడ్పీటీసీ స్వరూప మహేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి మరియు , ఎంపీటీసీలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. జగనన్న సమావేశ మందిరంలో ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

## పుత్తూరులో మొక్కలునాటిన బీజేపీ నాయకులు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:



ప్రధాన మంత్రి మోదీ జన్మదిన సప్తాహంలో భాగంగా పుత్తూరులో భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం గేటు పుత్తూరులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులు ముఖ్యంగా గ్యాస్, నీటి కొళాయిలు, ముద్ర లోన్లు, జనదన్ యోజన, అంత్యోదయ, అవాస యోజన, గ్రామీణ వికాస్ యోజన, స్కాలర్‌షిప్ వంటి పథకాల వలన లబ్ధి పొందిన వ్యక్తులను చెట్లు నాటేకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు చిలకం ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కైలాసం, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) గౌరవాధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యం, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, పుత్తూరు పట్టణ అధ్యక్షుడు గిరి ప్రసాద్, ఇన్‌చార్జి మహేంద్ర వర్మ, నాయకులు రాము, శేఖర్, వెంకటరాజు, శివరాజు, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రాజు, ఉపాధ్యాయులు ప్రసాద్, వెంకటరమణ, వెంకటేశ్వరరావు, వెంకటేశులు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా శ్రీ అభయ వినాయక అసోసియేషన్

రేణిగుంట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణంలోని జి.ఎం. స్ట్రీట్‌లో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 31 అడుగుల భారీ మట్టి వినాయకుడి నిమజ్జనాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా ప్రతిష్ఠించిన ప్రదేశంలోనే నిమజ్జనం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులను టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, నృత్య దర్శకుడు శివలను కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సుమన్, ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి అన్నదానం నిర్వహించారు. స్థానిక యువకుల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సాయంత్రం మహిళలు 108 బిందెలలో పాలను ఊరేగింపుగా తీసుకువచ్చి గణనాథుడికి పాలాభిషేకం చేశారు. గణనాథుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను నిర్వహించిన వేలంలో పంచర్ షాప్ మస్తాన్, అరుణ రూ.75 వేలకు దక్కించుకున్నారు. అనంతరం ఫైర్ ఇంజన్ సహాయంతో 31 అడుగుల మట్టి వినాయకుడిని అదే ప్రదేశంలో నిమజ్జనం చేశారు. మట్టి వినాయకుడి ప్రతిష్ఠ, స్థానికంగానే నిమజ్జనం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్ తరాల కోసం మట్టి వినాయకులను ప్రోత్సహించాలని కోరారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన పట్టణ ప్రజలు, జి.ఎం. వీధి వాసులు, దాతలు, అధికారులు, రాజకీయ నాయకులు, భక్తులకు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, ముఖ్య సలహాదారు డి. జూలియన్ రాజు, కమిటీ సభ్యులు సుమన్, కళ్యాణ్, పవన్, మురళి, ప్రభు, హేమాద్రి, సుబ్బు, వినోద్ కృతజ్ఞతలు తెలిపారు.

## తరగతి గది నుంచి పరిశ్రమ వైపు అడుగులు

### ఆట్రిసోల్ టెక్నాలజీస్‌తో ఎస్ఆర్ఈసీ అవగాహన ఒప్పందం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త



ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతోపాటు పరిశ్రమ అనుభవాన్ని అందించేందుకు శ్రీ రామ ఇంజినీరింగ్ కాలేజ్ (అటానమస్) మరో ముందడుగు వేసింది. విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆట్రిసోల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు సాంకేతిక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ ఆధారిత ప్రాజెక్టులు, నిపుణులతో పరస్పర చర్చలు, ప్రాక్టికల్ ట్రైనింగ్‌తో పాటు ప్లేస్‌మెంట్‌కు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తరగతి గదిలో విద్యార్థులు పొందే సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలోని వాస్తవ పరిస్థితులతో అనుసంధానం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఆధునిక పరిశ్రమ విధానాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు, వారి సాంకేతిక సామర్థ్యాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ప్రాజెక్ట్ నిర్వహణ, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడనుంది. పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు చేపట్టే అవకాశం కూడా విద్యార్థులకు కల్పించనున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు డిగ్రీతో పాటు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు కీలకంగా మారుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ద్వారా కెరీర్ అవకాశాలను మెరుగుపర్చే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం మరిన్ని ప్రముఖ పరిశ్రమలు, సాంకేతిక సంస్థలతో భాగస్వామ్యాలను విస్తరించనున్నట్లు పేర్కొంది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వాసు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి. కోసలేశ్వరరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణతోపాటు పరిశోధనలోనూ ముద్ర

### నాటుసారా తయారీదారుల పునరావాసంపై అధ్యయనం.. ఎస్వీయూ నుంచి బాలకృష్ణన్‌కు డాక్టరేట్



తిరుపతి విద్య సెప్టెంబర్ 21 ప్రభాత వార్త

ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే తన విధి నిర్వహణకు సంబంధించిన సామాజిక సమస్యపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తిరుపతి డిస్టిలరీల సహాయ కమిషనర్ ఎన్. బాలకృష్ణన్. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాజకీయ శాస్త్రం, ప్రజా పరిపాలన విభాగంలో ప్రొఫెసర్ బి.వి. మురళీధర్ ఆధ్వర్యంలో ఆయన పరిశోధన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో నాటుసారా తయారీదారుల పునరావాసం, ఎక్సైజ్ పరిపాలనపై, ముఖ్యంగా చిత్తూరు జిల్లాను కేంద్రంగా చేసుకుని బాలకృష్ణన్ పరిశోధన సాగించారు. నాటుసారా తయారీ నుంచి దూరమైన వారికి పునరావాసం కల్పించే విధానం, ప్రభుత్వ చర్యలు, ఎక్సైజ్ పరిపాలన తీరును అధ్యయనం చేశారు. ప్రభుత్వ సేవలో క్షేత్రస్థాయి అనుభవాన్ని పరిశోధనతో అనుసంధానిస్తూ సాగించిన ఈ అధ్యయనానికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన పరిశోధనా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పలు అంశాలపై పరిశోధనా వ్యాసాలను సమర్పించారు. డాక్టరేట్ ప్రదానం చేసిన విషయాన్ని విశ్వవిద్యాలయ మాధ్యమాల విభాగం డీన్ ప్రొఫెసర్ పి.సి. వెంకటేశ్వర్లు వెల్లడించారు. ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తూనే పరిశోధనను పూర్తి చేసి డాక్టరేట్ సాధించిన బాలకృష్ణన్‌ను పలువురు అభినందించారు.

## చదివే శాస్త్రం నుంచి చేసే శాస్త్రం వైపు

### విద్యార్థులకు ఆధునిక ప్రయోగశాలలు




తిరుపతి విద్య సెప్టెంబర్ 21 ప్రభాత వార్త

జీవాణు శాస్త్రం పుస్తకాల్లో చదవడానికే పరిమితం కాకుండా.. ప్రయోగశాలలో స్వయంగా పరిశీలించి నేర్చుకునే అవకాశం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. డా. వీబీఆర్ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మైక్రోబయాలజీ డే సందర్భంగా ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన జీవాణు శాస్త్రం, జీవరసాయన శాస్త్ర ప్రయోగశాలలను ప్రారంభించారు. దీంతో విద్యార్థుల సైద్ధాంతిక పరిజ్ఞానానికి ప్రయోగాత్మక అభ్యాసం జత కానుంది. కళాశాల జీవాణు శాస్త్ర విభాగాధిపతి ఎం. నవనీత ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల అధ్యక్షుడు డా. వెల్పుల విజయభాస్కర్, అధ్యక్షురాలు వి. త్రిపురాదేవి పాల్గొన్నారు. జీవాణు శాస్త్రం ఆరోగ్య పరిరక్షణతోపాటు దైనందిన జీవితం, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని వారు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించడంతోపాటు నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త ప్రయోగశాలల్లో ఆధునిక పరికరాలను వినియోగిస్తూ విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాలను ప్రత్యక్షంగా నిర్వహించే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పరిశీలన, విశ్లేషణ, ప్రయోగ నిర్వహణ వంటి నైపుణ్యాలు పెంపొందడంతో భవిష్యత్తులో ఉన్నత విద్య, పరిశోధనకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. మనోహర్, జీవాణు శాస్త్ర విభాగం అధ్యాపకులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీల్లో బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## న ఎంపీపీ, ఎంపీటీసీలకు ఘన సన్మానం

కేవీబీపురం, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీపురంలో సోమవారం చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్ అధ్యక్షతన ఎంపీడీవో మాలతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి శాఖల వారిగా ఎల్‌నీనోపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటలను వేసుకోవాలని, వరి పంటలు వేసుకోవద్దని మనకు రబీ సీజన్ బోర్లు ఉన్న వస్తుంది వరి పంటను వేయకూడదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సోలార్ సిస్టం ఉచితంగా ఇస్తుందని దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యాశాఖ ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్‌లు మాట్లాడుతూ పాఠశాల ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు ఈ నెల 29న నిర్వహించడం ఆ రోజు చైర్మన్‌లు వైస్ చైర్మన్ పాఠశాలకు ఎన్నిక చేయడం వారు జరుగుతుందని, 15వ తేదీ నుంచి 18 తేదీ వరకు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో మాలతి మాట్లాడుతూ మండలంలో 36 గ్రామాలకు గాను ఓటర్లందరికి 296 పోలింగ్ చేసిన సిద్ధం చేశామని 12ఎంపీటీసీ సిగ్మెంట్లకు 51 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని పంచాయతీలల్లో కండలూరు పంచాయతీకూడా కోర్టు నుంచి పరిష్కారమైందని కళత్తూరు పంచాయతీలో ఆదేశాలు రాలేదని ఆ పంచాయతీకి ఆర్డర్ వస్తేనే అక్కడ నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీపతిని మండల నాయకులు జడ్పీటీసీ, ఎంపీటీసీలు శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీని, ఎంపీటీసీలను మండల అధికారి యంత్రాంగం ఎంపీడీవో మాలతి శాలువలతో, పూలమాలతో మెమెంటోలతో సన్మానించారు. సమావేశంలో ఎంఈవోలు, ఏఈలు, ఏపీవోలు, పంచాయతీ సెక్రటరీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

### మైక్రోబయాలజీ భవనంపై ఎన్ఎస్‌యూఐ ఆగ్రహం



తిరుపతి విద్య సెప్టెంబర్ 21 ప్రభాత వార్త

విద్యార్థుల భద్రత విషయంలో ఎస్వీయూ అధికారుల నిరక్ష ్యం ఎంతకాలం ? అంటూ ఎన్ఎస్‌యూఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. మైక్రోబయాలజీ విభాగం భవనంలో వర్షపు నీరు విద్యుత్ స్విచ్‌బోర్డుల వద్దకు చేరుతోందని, భవనం పరిస్థితిపైనా ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని ఎన్ఎస్‌యూఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ ఆరోపించారు. విద్యార్థులు తరగతులకు హాజరయ్యే భవనంలోనే విద్యుత్ ప్రమాదం పొంచి ఉందన్న ఫిర్యాదులు రావడం అధికారుల భద్రతా పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. భవనం నిర్మాణ నాణ్యత, ప్రస్తుత స్థితిపై నిపుణులతో తక్షణం పరిశీలన చేయించాలని డిమాండ్ చేశారు. మైక్రోబయాలజీ విభాగంలో విద్యుత్ మరమ్మతులు, మళ్లీ భవన మరమ్మతులు, దెబ్బతిన్న తలుపులు, కిటికీల మార్పునకు సంబంధించిన పనులు ఇటీవల చేపట్టినట్లు ప్రభుత్వ టెండర్ వివరాలు చూపుతున్నాయి. విద్యార్థుల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని నిర్ధారించే వరకు ప్రత్యామ్నాయ భవనంలో తరగతులు నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ కోరింది. నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సమస్యను పరిష్కరించకపోతే విశ్వవిద్యాలయంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని శివ బాలాజీ హెచ్చరించారు.

## సర్ ప్రక్రియలో ఓటర్ల వారి పిల్లలను మ్యాపింగ్ చేయాలి

సత్యవేడు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:



సర్ ప్రక్రియ 2025 రెండో విడతలో భాగంగా ఓటర్లకు సంబంధించి వారి పిల్లలను మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందని తిరుపతి జిల్లా సత్యవేడు సహాయక ఓటర్లనమోదు అధికారి, తహసీల్దార్ శివప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితా, పోలింగ్ బూతులు తదితర అంశాలపై రాజకీయ పక్ష ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న పోలింగ్ బూతులకు బూతు లెవల్ అధికారులను నియమించాల్సి ఉందన్నారు. అలాగే ఓటర్ల సంఖ్య 800 నుంచి 1200 దాటిన కేంద్రాలను గుర్తించాలని ఆయన కోరారు. ప్రతి ఓటరు వారి పోలింగ్‌కేంద్రం రెండు కి.మీ లోపు ఉండేలా చూడాలన్నారు. దీన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అటువంటివిఏవైనా ఉంటే వివరాలు తెలియజేయాలన్నారు. సర్‌ప్రక్రియలో మ్యాపింగ్ పారదర్శకంగా జరిగేలా అన్నిరాజకీయ ప్రతినిదులు సహకరించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు శివయ్య, దిలీప్, బీజేపీ మునికృష్ణయ్య, సీపీఎం నాయకుడు రమేష్, ఎలెక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ్ మా కార్యక్రమం-ప్రెస్ క్లిప్పింగ్ కార్యక్రమం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:



పుత్తూరు ప్రాజెక్టు పరిధిలో కల్యాణపురం సచివాలయంలో పోషణ మా కార్యక్రమం నిర్వహించారు. పోషణ్-మా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో వేడిగా వండిన భోజనం యొక్క ప్రాధాన్యతపై లబ్ధిదా రులు, తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అమరావతి, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు వయసుకు తగిన విధంగా పోషక విలువలు కలిగిన పరిశుభ్రంగా తయారు చేసిన వేడిగా వండిన భోజనం అందించడం వల్ల వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడు తుందని వివరించారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరు ధాన్యాలు, గుడ్లు, ఇతర స్థానికంగా లభించే పోషక ఆహార పదార్థాలతో సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో జ్యోతి హాజరయ్యారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు కో-ఆర్డినేటర్ సంతోసి, ఏఎన్ఎం హిమబిందు, మెప్మా వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ సంధ్య పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో నిమజ్జన మహోత్సవాలు విజయవంతం

### వినాయక కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు



తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన సుమారు 1000 మండపాల గణపతి విగ్రహాలను మూడవ రోజు ఏడవరోజు వినాయక సాగర్‌లో సామూహిక నిమజ్జనం అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసౌకర్యం కలగకుండా సోమవారం ఉదయం 5 వరకు వినాయక స్వామి ఆశీస్సులతో విజయవంతంగా నిర్వహించుకోగలిగాము అని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ అన్నారు. మండపాలకు ఉచిత విద్యుత్ అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సహకారం అందించిన జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు, నగర పాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, తిరుమల తిరుపతి దేవస్థానములకు, అగ్నిమాపక సిబ్బందికి, తుడ అధికారులకు, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి, ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ అధికారులకు సిబ్బందికి ఇంజనీరింగ్ అధికారులకు నగరంలోని ప్రముఖులకు మండప నిర్వాహకులకు తిరుపతి ప్రజల తరఫున ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు తెలియజేస్తుందని, 25 సంవత్సరాల భక్తి పూరిత ప్రయాణంలో అందరి సహకారం మరువలేదని అన్నారు. రానున్న కాలంలో మరింత క్రమశిక్షణతో వైభవంగా నిర్వహించుకోవాలని అందరి సహకారం కావాలని కోరారు.

## సత్యవేడులో చివరి సర్వసభ్య సమావేశం - ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గంలో పునర్విభజనలో భాగంగా అవకాశం వస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్థానిక ఎంపీపీ ప్రతిమ తన మనసులో మాటను బయటపెట్టారు. సెప్టెంబరు 23వ తేదీ ప్రస్తుత పాలకమండలి పదవి కాలం ముగుస్తున్న నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ సుశీల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన, ఎంపీడీవో వెంకటేశ్వరులు పర్యవేక్షణలో జరిగిన చివరి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్‌గా మూడు సార్లు, ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. తనకు పుట్టినిల్లు అయిన మెట్టినిల్లు అయిన మండల పరిషత్ కార్యాలయమే అన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం తన తండ్రి రఘుపతి రెడ్డిది అన్నారు. తన తల్లి కూడా ఇక్కడే ఎంపీపీగా సేవలు అందించినట్లు గుర్తు చేశారు. అందు వల్లే రఘుపతిరెడ్డి కూతురుగా తనకు ఎంపీపీగా సేవలు అందించే భాగ్యంకలిగిందన్నారు. సుశీల్‌కుమార్‌రెడ్డి తన వెన్నంటే ఉండడం వల్లే రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. ముఖ్యంగా మండల అభివృద్ధిలో ఎంపీటీసీలు కీలక పాత్ర పోషించి సహకారం అందించడం మరువలేనన్నారు. ఈ ఐదేళ్ళలో దాదాపు మూడున్నర కోట్ల రూపాయల వరకు మండల పరిషత్ నిధులు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించినట్లు ఆమె వివరించారు. అభివృద్ధికి సహకరించిన మండల వివిధ శాఖలకు చెందిన అధికారులందరికి కృతజ్ఞతలు తెలిపారు. సభ ప్రారంభమైన వెంటనే ఎంపీపీ ప్రతిమ మాట్లాడే సమయంలో కాసేపు భాగోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇదే చివరి సమావేశం కావడంతో ఒకంతెంపీపీ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఎంపీపీ తన భర్త సుశీల్ కుమార్‌రెడ్డితో కలసి ఎంపీడీవో వెంకటేశ్వరులు పరిపాలన అధికారి త్రివిక్రమరావు తదితరులు సమక్షంలో వైస్ ఎంపీపీలు శరవణ, వెంకటరత్నమ్మ పలువురు ఎంపీటీసీలకు, కో-ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మకు శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి మెమెంటో బహిష్కరించారు. అనంతరం ఎంపీపీ ప్రతిమ, సుశీల్‌కుమార్‌రెడ్డిలను మండల పరిషత్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, వెలుగు అధికారులు శాలువతో కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో వైసీపీ నాయకులు రఘుపతిరెడ్డి, ఏవీఎం బాలాజీరెడ్డి, ఎంపీ రవి, మాజీసర్పంచ్‌లు శేఖర్, శ్రీరాములు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శైలజ, ఆర్టీసీ డీఎం వెంకటరమణ, పరిపాలన అధికారి త్రివిక్రమ రావు, ఎంఈవో రవి, ఎంఈవో-2 ఉష, రెవెన్యూ డీటీ వెంకటేశ్వర్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి అధికారిణి జ్యోతి, ఉపాధి ఏపీవో విజయభాస్కర్, వెలుగు ఏపీఎం మోహన్, సీసీ శివకుమార్, అటవీ అధికారి వేణు, డిప్యూటీ ఎంపీడీవో ముని రవికుమార్, ఎంపీటీసీలు రామయ్య, బాలయ్య, బాలసుందరం రెడ్డి, సుధాకర్, సురేందర్, సెల్వి, షీల, నాగమ్మ, పలువురు పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## గొడ్డల పార్టీ డైరెక్షన్...కిరాయి మనుషుల యాక్షన్




శ్రీకాళహస్తి సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : రాష్ట్రంలో శాంతి భద్రతల విఘాతానికి గొడ్డల పార్టీ నాయకుడు దర్శకత్వంలో కిరాయి నటులు యాక్షన్ చేస్తున్నరని గ్రంధాలయ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి సోమవారం ధ్వజమెత్తారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే ఒక దుర్దినమని, దేవాలయం లాంటి క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన క్రీడా ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు రాళ్లు, రాడ్లు, కోడిగుడ్లతో దాడికి పాల్పడటం దారుణమని ఆయన మండిపడ్డారు. సోమవారం శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయవాడలో జరిగిన ఈ దాడి తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్ లోనే జరిగిందని, ఇది జగమెరిగిన సత్యమని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి లోకేష్ సారథ్యంలో నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని 16 వేల డీఎస్సీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తే, ఎలాంటి తప్పులు లేకపోయినా జగన్ తన పేటీఎం బ్యాచ్ ద్వారా అబూత కల్పనలు సృష్టించి అపద్ధపు ప్రచారం చేస్తూ రాజకీయ స్వార్ధానికి వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

## తెలుగు సాహిత్యానికి మార్గదర్శి గురజాడ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాత వార్త: సామాన్యప్రజల అభివృద్ధి లక్ష్యంగా గురుజాడ అప్పారావు రచనలు చేశారని ఆధునిక తెలుగు సాహిత్యానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచారని ఎస్‌విఏ ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ టి.గంగారాం తెలిపారు. సోమవారం జరిపిన కార్యక్రమాల్లో తెలుగు అధ్యాపకులు కె.సుబ్బారావు మాట్లాడుతూ గురుజాడ రచించిన దేశభక్తి గేయం ప్రజల్లో దేశభక్తిని సామాజిక బాద్యతను పెంపొందించిందని జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యాపకులు విద్యార్థులు సామూహికంగా దేశభక్తి గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.సాయివెంకటేష్, టి.నరసింహులు, సి.బాపనయ్యలు పాల్గొన్నారు.

## చియ్యవరం జాతర పూజలకు అనుమతివ్వాలి



తొట్టంబేడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో ఈ నెల 24 న జరగనున్న పోలేరమ్మ జాతరలో దళితులకు కూడా పూజలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ దళిత సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం డీఎస్పీ కె.నరసింహామూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గ్రామాల్లో ఈ పండుగలపై చైతన్య పరిచే సమావేశాలు నిర్వహించి గ్రామదేవతలకు అందిరితో సమానంగా పూజలు నిర్వహించుకునేలలా చైతన్య పరచాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కెవిపిఎస్ అంగేరి పుల్లయ్య, మణి, గురవయ్య, శివకుమార్, జాకీర్, సురేష్, సమీర్, కోటయ్యలు ఉన్నారు.

## శ్రీకాళహస్తిలో నాసిరకం బిరియాని సెంటర్లు

### -పట్టణంలో పుట్టగొడుగుల్లా బిరియాని సెంటర్లు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో వీధి వీధిలో ఏర్పాటు చేసిన బిరియాని సెంటర్లలో అందిస్తున్న భోజనం ఆరోగ్యానికి హానికరంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని ప్రాంతాలలో ఉన్న ఓ బిరియాని సెంటర్‌ల వ్యవహారం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాశం అయింది. హోటల్‌లో కొత్తపేటలో వడ్డిస్తున్న బిర్యానికి రుచి నాణ్యత ఏమాత్రం లేదని, తిన్న తరువాత కడుపులో నొప్పి, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు లభించే నాసిరకం నూనె వాడటం, నిల్వ ఉంచిన మాంసాన్ని వినియోగించడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతోందని స్థానికులు చెబుతున్నారు. రోజు వందలాది మంది ఈ హోటల్స్‌కు వస్తుండడంతో ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. కల్తీ ఆహారం విక్రయిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ ఆరోగ్య శాఖ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

## బస్ స్టాప్ సమస్య పరిష్కరించండి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నుండి తిరుపతి వెళ్లే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులను పట్టణ పరిధిలోని మిట్టకండ్రిగ వరకు అన్ని స్టాపుల్లో ఆపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు సోమవారం శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రేవతికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో ఈ వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి దేశం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు వస్తున్నారని, తిరుగు ప్రయాణంలో రైల్వే స్టేషన్ వద్ద బస్సు దిగి రైలు ఎక్కేవారు, అలాగే తిరుపతికి ఉద్యోగం, వైద్యం, విద్య కోసం వెళ్లే ప్రయాణికులు రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ వద్ద బస్సులు ఆపకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై డిపో మేనేజర్ రేవతి సానుకూలంగా స్పందించి, సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, సీనియర్ నాయకులు నాగూరయ్య, ముని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మానవతా విలువల్ని...పెంపొందించిన గురజాడ



తిరుపతి, సెప్టెంబర్ 21ప్రభాతవార్త: తెలుగు సాహిత్యంలో ఆధునిక భావ జాలానికి ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు బలమైన పునాది వేశారని ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఎన్. శోభా వాలెంటీనా, ఆర్. పద్మ, ఎం. మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, ఎం. శ్రీకాంత్, ఏ. శ్రీనివాస బాబు, జి సుధాకర్, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### తెల్ల ముత్యాలు, వట్టివేరు, కురువేరుతో

## వైభవంగా స్నపన తిరుమంజనం



తిరుమల, సెప్టెంబర్ 21 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి సోమవారం స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. తెల్ల ముత్యాలు, వట్టివేరు, కురువేరు, డ్రై ఫ్రూట్స్, గాజులు, వక్క ఆకులు తదితరాలతో రూపొందించిన విశేష మాలల మధ్య స్వామి, అమ్మవార్లు దివ్య అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. పంచామృతాలతో పవిత్ర అభిషేకం చేశారు. తెల్ల ముత్యాలు, వట్టివేరు, కురువేరు, డ్రై ఫ్రూట్స్, గాజులు, వక్క ఆకులు, పసుపు రేకులు, రోజాలు, బటన్ చామంతి మాలలతో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సి.హెచ్. వెంకయ్య చౌదరి, పాల్గొన్నారు.

## ఫోర్జరీ పత్రాలతో ఆన్ లైన్ ఎంట్రీలు!

### -అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఏర్పేడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం చిందేపల్లిలో దళిత రైతుల భూములను కొందరు స్థానికేతర పెద్దలు ఫోర్జరీ దస్తావేజులు సృష్టించి ఆన్‌లైన్‌లో అక్రమంగా ఎంట్రీ చేయించు కున్నారని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో దళిత రైతులు ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎమ్మార్వో పి.రాజశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఐఐటీ, ఐసర్, పరిశ్రమలు వచ్చిన తర్వాత భూములకు రెక్కలొచ్చాయని దీంతో అనుభవంలో ఉన్న దళితుల భూములపై కొందరు కన్నేసి తప్పుడు పత్రాలు సృష్టించి ఆన్ లైన్ ఎంట్రీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. 18 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూమి పేరుతో ఇతరుల పేరిట ఎలా నమోదు చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సుల ప్రకారం అనుభవదారులకు హక్కులు కల్పించాలని కోరారు. గతంలోనూ చిందేపల్లిలో ఇళ్ల స్థలాల పేరుతో దళితుల భూములు తీసుకుని తిరుపతి ప్రాంతం వారికి కేటాయించారని, ఇప్పుడు మిగిలిన కొద్దిపాటి భూమిని కూడా కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దళితులకు శ్మశాన వాటికలు, దార్లు, ఇళ్ల స్థలాలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని, ఐఐటీ, ఐసర్, పరిశ్రమల్లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వరకు, అవసరమైతే రాష్ట్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, మండల అధ్యక్షులు మాసపల్లి నాగరాజు, నాయకులు వెంకటాద్రి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, చిందేపల్లి దళిత రైతులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ వివరణ:**
చిందేపల్లి రైతుల అర్జీపై పూర్తి విచారణ చేపట్టి ఫోర్జరీ దస్తావేజులు సృష్టించిన వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని, చట్టపరంగా అనుభవ దారులకు న్యాయం చేస్తామని ఎమ్మార్వో పి. రాజశేఖర్ తెలిపారు.

## బేరి వారి మండపం వినాయకునినిమజ్జనం నేడు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం వద్దప్రతిష్టించిన మట్టి వినాయకుని మంగళవారం సాయంత్రం నిమజ్జనానికి సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది లోకకళ్యాణం కోసం గణపతి హోమాలు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. ఇక్కడ ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని మంగళవారం సాయంత్రం 5గంటలకు నిమజ్జనానికి ఏర్పాటు చేసినట్లు రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ తెలిపారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సోమవారం మృత్యుంజయస్వామికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకాలంకారం గావించారు. ఈ ఆలయంలో వెలసిన మృత్యుంజయ స్వామిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క్ కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి అభిషేకాలను తిలకించి దర్శించుకున్నారు. వారికి ఏర్పాట్లను ఆలయ ఎఇఓలు లోకేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకట స్వామి, హరియాదవ్, శ్రీకాళహస్తి తహశీల్దార్ టివి సుబ్రమణ్యంలు పర్యవేక్షించారు.

## నేటి నుంచి శివయ్య పవిత్రోత్సవాలు




శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తి శ్రద్దలతో స్థానిక సంప్రదాయ బద్దంగా నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద సోమవారం శ్రీ-కాళ-హస్తిలను ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు. తరువాత స్వామి అమ్మవార్లకు పవిత్రాలు సమర్పిస్తారు. ఆలయంలో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న పరివార దేవతలకు కూడా పవిత్రాలనుసమర్పించే సంప్రదాయం అమలులో ఉంది. ఆలయంలో నిత్యం జరిగే పూజలు, అభిషేకాలు, సేవలకు సంబంధించి తెలిసి తెలియక జరిగే తప్పిదాలను నివృత్తి చేయటానికి మూలవిరాట్లకు పునరేత్తేజం తెచ్చే విధంగా పూజలను చేపట్టారు. ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ పూజలకు ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా కొట్టె సాయి ప్రసాద్, ఇఓగా బికె వెంకటేశులు బాధ్యతలు చేపట్టిన తరువాత ఆలయంలో నిర్వహించే ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. స్థానిక సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించుటకు ప్రయత్నిస్తున్నారు.

## మసీదుకు నీటికై ఎంఎల్‌ఏ స్పందన

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని పిట్టలవారి సందులో ఉన్న మసీదుకు వజు(కాళ్ళు చేతులు కడుక్కోవటానికి) చేసుకోవటానికి నీటి సదుపాయానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్పందించారు. సోమవారం పట్టణానికి చెందిన మసీదు పెద్దలు ముస్తాఫా, బాబు, నజీర్‌లు సమస్యను ఎంఎల్‌ఏ దృష్టికి తెచ్చారు. ఈ మసీదుకు సంబంధించిన బోరు శివం టు శివం రోడ్డు నిర్మాణం సందర్భంగా గోడ నిర్మాణంతో శిధిలమైంది. దాంతో మసీదుకు మంచినీటి సమస్య చోటు చేసుకుంది. ఈ సమస్యను ఎంఎల్‌ఏకు వివరించిన వెంటనే ఆయన స్పందించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డిఇ రవి ప్రకాష్‌ను ఆదేశించారు. ఇక్కడ మున్సిపల్ స్థలంలో కొత్త బోరు వేయటానికి నిర్ణయించారు. దాంతో మసీదుకు నీటి సమస్య పరిష్కరించిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డికి సంబంధించి మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు.

## మహాకవి గురజాడ జయంతి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: తెలుగు సాహిత్యానికి నూతన వెలుగులు అద్దిన మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలు సోమవారం శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలోని మూఢాచారాలను ప్రశ్నిస్తూ మానవ విలువలను చాటుతూ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అనే ఆయన సందేశం నేటికీ సమాజానికి మార్గదర్శకమని, తెలుగు భాష, సాహిత్యం, సామాజిక చైతన్యానికి గురజాడ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన కృషిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, గ్రంథాలయాల ద్వారా ఆయన సాహిత్యాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.హరికృష్ణ, పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిల్లు కట్టినా కరెంట్ కట్!




తొట్టంబేడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం తొట్టంబేడు పంచాయతీ మాజీ సర్పంచ్ సుబ్బయ్య ఇంట్లో విద్యుత్ శాఖ అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. విద్యుత్ బిల్లు చెల్లించలేదనే సాకుతో ఇంటికి వచ్చిన సిబ్బంది బిల్లు మొత్తాన్ని వసూలు చేసుకున్న తర్వాత కూడా ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా ఏకంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. ఇంట్లో మహిళలు ఉన్నారని కాస్త సమయం ఇవ్వాలని వేడుకున్నా వినకుండా దురుసుగా ప్రవర్తించి కనెక్షన్ కట్ చేసి వెళ్లిపోయారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు బంధువులు సోమవారం తొట్టంబేడు ఆపరేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. బిల్లు కట్టిన తర్వాత కరెంట్ తీసేయడం ఏంటని ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## మహిళపై దాడి కేసులో...నింధితునికి రిమాండ్



తొట్టంబేడు, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పోలీసు సబ్‌డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి ఒత్తిడులకు లోను కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. మహిళలపై దాడికి పాల్పడిన వారిని చట్టం ఎట్టి పరిస్థితిలో వదిలేదిలేదని డిఎస్పీ కె.నరసింహామూర్తి సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ తొట్టంబేడు మండలం పొయ్యకొత్తూరు గ్రామానికి చెందిన గోరిపాటి సురేష్(28) రెండు రోజులుగా ఇద్దరు మహిళల సట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా వారిపై దాడి చేసి గాయపరిచాడని ఈ మేరకు సాలిపేటలో నివాసం ముంటున్న హిమబిందు అనే మహిళ వారి వాహనాన్ని ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేశాడని బాదితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్‌ఐ జ్యోతి కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే నిందుతుల్ని అదుపులో తీసుకుని శ్రీకాళహస్తి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు. న్యాయస్థానం నిందుతునికి 13 రోజుల రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా దురుసుగా ప్రవర్తించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ వెంకటేష్, టూటౌన్ ఎస్‌ఐ జ్యోతిలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై దాడులు...జగన్ ప్రేరేపితమే !



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా దేశ కీర్తిని పెంచే క్రీడాకారులపై విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడులు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రేరేపితమేనని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఉమేష్ రావు ఆరోపించారు. శ్రీకాళహస్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు శాప్ కార్యాలయానికి వెళ్లిన విషయం తెలుసుకుని వైసీపీ నేత దేవినేని అవినాష్ బృందం రాళ్లు, రాడ్లు, కోడిగుడ్లతో దాడి చేసి అసభ్యంగా ప్రవర్తించారని ఇది జగన్ ప్రోద్భలంతోనే జరిగిందని విమర్శించారు. ఇలాంటి ఆటవిక చర్యలు సమాజానికి మంచిది కాదని హెచ్చరించారు. క్రీడలను, క్రీడా మైదానాలను పట్టించుకోని జగన్, ఎన్డీయే ప్రభుత్వం డీఎస్సీలో క్రీడాకారులకు 3 రిజర్వేషన్ ఇచ్చి గౌరవించడాన్ని తట్టుకోలేక తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, పీఏసీఎస్ చైర్మన్ బీమాల భాస్కర్, మాజీ చైర్మన్ డి.వి. నారాయణ, నాయకులు కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి, పూల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 40 వినతులు : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 21 ప్రభాత వార్త: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 వినతులు వచ్చాయని కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ఆరు మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 34 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కొర్లగుంట మారుతీ నగర్ లో కలుషితమైన తెలుగు గంగ నీరు వస్తున్నాయి తగుచర్యలు చేపట్టాలని, ఖాదీ కాలనిలో రోడ్లపైన ఉన్న గుంతలు పూడ్చాలని, సప్తగిరి నగర్ నందు డ్రైనేజి కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు ఇండ్లలోనికి వస్తున్నాయి పరిశీలించాలని, గరుడాద్రి నగర్ నందు మురుగునీరు రోడ్లపై వస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతూ, అనారోగ్యం పాలవుతున్నాము తగు చర్యలు తీసుకోవాలని, అంధుల శరణాలయం వద్ద కుక్కలు, దోమల బెడద ఎక్కువగా ఉందని, పట్నూల్ వీధి మెయిన్ రోడ్డుకు సిసి రోడ్డు వేయాలని, ఎస్.కె.డి. నగర్ లో నిర్వహిస్తున్న హాస్టల్ వారు వ్యర్థాలు కాలువలో వేయడం వలన దుర్వాసన ఎక్కువగా ఉందని, వరదరాజ నగర్ లో 60అడుగుల రోడ్డు అన్యాక్రాంతం అవుతున్నది పరిశీలించాలని, ఇంటి పన్నులో తన పేరు రామమూర్తిగా మార్చాలని కోరారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులకు పంపి చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. రామమూర్తి అనే 10 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశానని ఫలితాలు బాగున్నాయని తెలుపగా కమిషనర్ ఆయన్ను అభినందించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు అందరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సర్వేయర్ గురువా రెడ్డి, మేనేజర్ హసీమ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సాహిత్యానికి సాంకేతికత జోడిస్తేనే విశ్వవ్యాప్తి




తిరుపతి విద్య, సెప్టెంబర్ 21 ప్రభాత వార్త: ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్యాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి, అనువాదాల ద్వారా విశ్వవ్యాప్తం చేయాలని పలువురు భాషా, సాహిత్య నిపుణులు పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఏఐ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్, హిందీ సప్తాహ్ సందర్భంగా హిందీ కా వైశ్విక పరిదృశ్య: విస్తార్, చునౌతీయా ఔర్ సంభావనాయే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య తాత నర్సింగరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నామలై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ సాహిత్య వికాసానికి ఏఐ సాధనాలను వినియోగించుకోవాలని సూచించారు. సదస్సు అధ్యక్షుడు డాక్టర్ నారాయణ సాహిత్యానికి సాంకేతికతను జోడించి దాని పరిధిని విస్తరించాలని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ హిందీ మాట్లాడేవారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఆ భాషను చదివేవారి సంఖ్య తగ్గుతోందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే హిందీని అభ్యసించాలని సూచించారు. మోలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆచార్యులు రత్నాకర్ సాహిత్య అనువాదంలో ఏఐని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.ఆర్. రాసాని రచించిన ఆదియోధుడు నవలను డాక్టర్ వి. జగదీష్ హిందీలోకి అనువదించిన ఆదియోధ్ నవలను ఆవిష్కరించారు. హిందీ సప్తాహ్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్‌రెడ్డి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురువులపై దాడులా...?

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న గొడ్డలి పార్టీ

తిరుపతి, సెప్టెంబర్ 21ప్రభాతవార్త: గురువులపై గొడ్డలి పార్టీ నాయకుల దాడులు క్షమించరాని నేరమని, మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదని హైకోర్టు, విద్యాశాఖాధికారులు స్పష్టం చేసినా గొడ్డలిపార్టీ రాద్ధాంతం చేస్తోందని తెలుగుయువత నేత రాగల ఆనంద్ గౌడ్ విమర్శించారు. లిక్కర్ కేసుల నుండి పక్కదారి పట్టించడానికి ఈ దాడులకు పాల్పడుతున్నారని, జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకవైపు లిక్కర్ స్కామ్, మరో వైపు గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంలో అక్రమాలు బయటకు రావడంతో జగన్ బ్యాచ్‌లో గగ్గోలు మొదలైందన్నారు.

**CHANGE OF NAME**

I, **KARRA SUJATHA,** W/o Late S. BHASKAR REDDY, R/at D.No. 10-28, Professor Quarter-3, TTD E.O. Bungalow Back Side, Tirupati Urban, Tirupati District, A.P., do hereby declare that I have changed my son's name from **S SUJITH CHRISTOFER**, S/o S. BHASKAR REDDY (Father) and **KARRA SUJATHA** (Mother), born on 01-03-2009, to **SANTHAPETA SUJITH,** S/o S.BHASKAR REDDY (Father) and KARRA SUJATHA (Mother).